క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: పేదలకు వైద్యం అందించడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆపత్కాలంలో ఆపన్నహస్తంలా ఆదుకుంటుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.2.45లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆంజనేయులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గుండ్ల మాచునూరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ బేకర్ సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ రిజ్వాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి



నివాళులర్పిస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు సత్యనారాయణ, సాయిమౌనిక, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు



రైస్ మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గురువారం కేంద్రంలో 600 బస్తాల ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. దాదాపు 350 బస్తాలు కాంటా వేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయి. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోంది. వావిలాల, ఊట్ల, సోలక్‌పల్లి కేంద్రాల్లో సాఫీగా సాగుతున్నాయి. కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులో మరాడించి రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చెరువు అభివృద్ధికి కృషి



చెరువును సందర్శించిన కార్పొరేటర్ పుష్ప, అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలసి చెరువును సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయసముద్రం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఏఈ రంజిత్, డీఈ నరేందర్, ఏఈ దివ్య, నాయకులు చిగురు శ్రీను, కిరణ్‌గౌడ్, రవిగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

ఇదేం ప్రగతి?

- అభివృద్ధికి నోచుకోని కంది మండలం
- ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కరువు
- ధ్వంసమైన రోడ్లతో ప్రజల ఇబ్బందులు



పాఠశాల పాత భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

కంది(సంగారెడ్డి): నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన కంది మండలం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మండలం ఏర్పడి 11 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మండల కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్ కార్యాలయం గ్రామ పంచాయతీ కోసం నిర్మించిన భవనంలో కొనసాగుతుండగా.. ఎంపీడీఓ కార్యాలయం పాఠశాల పాత భవనంలో కొనసాగుతోంది. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో సంగారెడ్డి మండలం నుంచి కంది మండలాన్ని 22 గ్రామ పంచాయతీలతో నూతనంగా ఏర్పాటు చేశారు. మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. మండలానికి అవసరమైన పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా పథకం, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర శాఖల కార్యాలయాలు ఇప్పటివరకు నిర్మించకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర సేవల కోసం వందలాది మంది ప్రజలు వస్తుంటారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు మరుగుదొడ్లు, ఇతర వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు మరింత ఇబ్బంది పడాల్సి పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా గ్రామాలకు వెళ్లే రహదారులకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో కంకర తేలి గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దీంతో గ్రామాలకు రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మండల కార్యాలయాలకు సొంత భవనాలు, పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టి తమ కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మక్త అల్లూరు వద్ద కంకర తేలిన రోడ్డు

మంజీరా నదిపై డ్యాం నిర్మించండి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్

నారాయణఖేడ్: మంజీరా నదిపై రోడ్ కం, డ్యాంను నిర్మించి నియోజకవర్గ ప్రజల దాహార్తి, సాగునీటి అవసరాలు తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మంజీరా నది నియోజకవర్గం గుండా ప్రవహిస్తుందని, మంజీరాపై సింగూరు ప్రాజెక్టు నిర్మాణం వల్ల సారవంతమైన భూములు ముంపునకు గురయ్యాయన్నారు. నియోజకవర్గం గుండా మంజీరా నది ప్రవహిస్తున్నా సాగునీటి సమస్య ఉందన్నారు. కావున నదిపై రోడ్ కం, డ్యాం నిర్మించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. జహీరాబాద్ సభలో సీఎం డ్యాం నిర్మాణం, నిధుల గురించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మనూరు మండలం రాయిపల్లి వంతెన వద్ద రోడ్ కం డ్యాంను నిర్మిస్తే అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చడంతో పాటు సాగునీరు పుష్కలంగా అందుతుందని తెలిపారు. అంతేకాకుండా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. దీనికి తోడు బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఇప్పటికే మంజీరాపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలను కూడా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విన్నవించారు.



మాట్లాడుతున్న అతిమేల మాణిక్

ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధ్యక్షుల నియామకం

జహీరాబాద్ టౌన్: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ)మొగుడంపల్లి, సంగారెడ్డి మండలాల అధ్యక్షులను నియమించినట్లు గురువారం జిల్లా అధ్యక్షుడు వినాయక్ పవార్ తెలిపారు. మొగుడంపల్లి మండల అధ్యక్షుడిగా గోవింద్ రాథోడ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డిలను నియమించామన్నారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మైపాల్, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల అధ్యక్షుడు సత్యనారాయణ, రాజనర్సింహ్మలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని దళితవాడలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లు, నృత్యం చేసుకుంటూ తరలారు. కాలనీ నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు స్థానిక నల్ల పోచమ్మ దేవాలయం వరకు కొనసాగింది. ఆలయంలో మహిళలు, కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు.



బోనాల ఊరేగింపు

జహీరాబాద్‌లో ‘తిరంగా యాత్ర’

జహీరాబాద్ టౌన్: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ ఎంపీ.బీబీపాటిల్ బీజేపీ నాయకులు మువ్వన్నెల జెండాలను చేతబట్టి సైనికులను ప్రశంసిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్యనగర్ వద్ద ఉన్న శివాజీ విగ్రహం నుంచి రహదారి గుండా అతిథిగృహం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్, భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, దుర్గయ్య, సుధీర్ శ్రీనివాస్ గుప్తా, విశ్వనాథ్ స్వామి పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో తిరంగా యాత్ర

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా యాత్ర నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్‌లో వీర మరణం పొందిన భారత సైనికులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఈసీ సభ్యులు అరుణ్‌రాజ్ శేరికార్, నాయకులు పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్: తిరంగా యాత్రలో గోదావరి, బీబీపాటిల్ తదితరులు

వర్షంతో తడిసిన ధాన్యం కుప్పలు



చాంద్‌ఖాన్‌పల్లిలో తడుస్తున్న ధాన్యం కుప్పలు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు తీసుకువచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. కొద్ది రోజులుగా ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో టార్పలిన్లు కప్పినప్పటికీ భారీవర్షం కురవడంతో ధాన్యం కుప్పలు తడిసి పోతున్నాయని రైతులు వాపోయారు. తమ ధాన్యాన్ని రైస్ మిల్లర్లు సకాలంలో దించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వల్ల మామిడి పంట నేలరాలుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాలీబాల్ విజేతగా ముద్దాయిపేట



ముద్దాయిపేట జట్టు

పుల్‌కల్(అందోల్): మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో ముద్దాయిపేట జట్టు విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. సూరెడ్డి ఇటిక్యాలలో జరిగిన ఈ పోటీల్లో మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 18 జట్లు పాల్గొన్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ జొన్నల కొనుగోలు కేంద్రం తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో ఏఓ వెంకటేశం గురువారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్ల గురించి తెలుసుకున్నారు. మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఐకేపీ సీసీ సాయిలు, నాయకులు జితేందర్‌రెడ్డి, సంగారెడ్డి పాల్గొన్నారు.

◆ నేడు కుస్తీ పోటీలు

కల్హేర్(నారాయణఖేడ్): దుర్గమాత జాతర ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని మీర్ఖాన్‌పేట్‌లో శుక్రవారం కుస్తీలు పోటీలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి పహిల్వాన్లు వచ్చి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

◆ మజ్జిగ పంపిణీ

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు జెన్‌కో ఉద్యోగి కుర్మి పాండయ్య జాడీ మల్కాపూర్ దుర్గదేవి జాతరలో భక్తులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతిఏటా జాతరలో ఉచితంగా మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

◆ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల్లో భాగంగా మొదటిరోజు ఇంటర్మీడియట్ విద్యార్థులకు తెలుగు, హిందీ, అరబిక్ , సంస్కృతం, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 3459 మంది విద్యార్థులకు గాను 3211 మంది విద్యార్థులు హాజరయ్యారు. 248 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 820 మంది విద్యార్థులకు గాను 769 మంది విద్యార్థులు హాజరయ్యారు. 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

◆ సీఎం సభను విజయవంతం చేయండి

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్‌లో శుక్రవారం నిర్వహించే సీఎం సభను విజయవంతం చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రప్ప, ఎంపీపీ గౌసోద్దీన్ కోరారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. భారీ ఎత్తున నిర్వహించే సీఎం సభకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిలింగయ్యస్వామి, రఫీయోద్దీన్, సామెల్ పాల్గొన్నారు.

◆ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్‌రెడ్డి నగర్ కాలనీలో నివాసముండే గోపి (36), అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నగర అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి.. రూ.10 వేల ఆర్థికసహాయం అందజేశారు.

◆ మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో మంత్రి దామోదర రాజనర్సింహ దంపతులు గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో మంత్రి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ మండలంలో డీఈఓ పర్యటన

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పర్యటించారు. మల్‌చెల్మ గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలను పరిశీలించారు. అనంతరం మొగుడంపల్లి మండలంలో కొత్తగా నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం పనులను పరిశీలించారు. మొగుడంపల్లిలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు సందర్శించారు. శిక్షణ ముఖ్య ఉద్దేశాల గురించి వివరిస్తూ బోధన సామర్థ్యాలు పెంపుదలకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వెంకటేశం, జీసీడీఓ సుప్రియ, ఎంఈఓలు బస్వరాజ్, జాఫర్‌లు ఉన్నారు.

◆ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా సంగమేశ్వర్

నారాయణఖేడ్: లయన్స్ క్లబ్ నారాయణఖేడ్ 2025–26 సంవత్సరానికి లయనిస్టిక్ ఎన్నికలు గురువారం జరిగాయి. జోన్ చైర్మన్‌గా రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా బావుగి సంగమేశ్వర్, కార్యదర్శిగా బల్లపు మల్లేశ్, కోశాధికారిగా నర్సింహారెడ్డిలను ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. స్థానిక లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డితో పాటు సీనియర్ లయన్స్ క్లబ్ బాధ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: హనుమాన్ కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ ఆలయం, చైతన్యనగర్ హనుమాన్ దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించి, శాలువాతో సత్కరించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ లక్ష తమల పాకులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటిన ఎమ్మెల్యే..

పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మరోమారు దాతృత్వం చాటుకున్నారు. మండలం పరిధి రుద్రారం గ్రామ పంచాయతీలో సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం భూమి అంశంలో నష్టపోతున్న బాధితులకు ఎమ్మెల్యే అండగా నిలిచారు. గురువారం గ్రామ పెద్దల సమక్షంలో లబ్ధిదారులు జొన్నాడ మహేశ్, జహంగీర్లకు రూ.5 లక్షల చొప్పున.. రూ.10 లక్షల సొంత డబ్బులు అందజేశారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కార్యకర్త కుటుంబానికి చేయూత

దశాబ్దకాలంగా తన విజయాల్లో వెన్నంటి నిలుస్తూ ఇటీవల మృతి చెందిన రుద్రారం గ్రామానికి చెందిన కురుమ నరసింహులు కుటుంబానికి ఎమ్మెల్యే అండగా నిలిచారు. నర్సింలు కుటుంబాన్ని పరామర్శించి.. లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు, నాయకులు ఉన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి



మిర్జాపూర్(బి)లో కొనసాగుతున్న శిక్షణ

న్యాల్‌కల్, (జహీరాబాద్): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. మండలంలోని మిర్జాపూర్(బి)జెడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూస పద్ధతిలో కాకుండా విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా బోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరెంట్స్, టీచర్ మీటింగ్‌పై అవగాహన

రాయికోడ్(అందోల్): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలు, ఉపాధ్యాయుల ఇన్‌సర్వీస్ శిక్షణ సమావేశం మూడవ రోజు గురువారం కొనసాగింది. పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహణ విధానాలు, పిల్లలు ఇష్టంతో పాఠశాలలకు హాజరయ్యేందుకు దోహదపడే కార్యక్రమాలపై ఎంఈఓ మాణయ్య, హెచ్ఎం శ్రీనివాస్ టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో ఆర్పీలు శ్రీనివాస్, యాదవులు, తులసి ,ఆయా పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో గురువారం ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఎంఈఓలు జి.శ్రీనివాసులు, నాగరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల మధ్యలోకి మురికినీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు



ప్రధాన రహదారిపై పడిన చెట్టు

హత్నూర(సంగారెడ్డి): ప్రధాన రహదారిపై ఒకసారిగా చెట్టు విరిగిపడడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన హత్నూర మండలం దౌల్తాబాద్ నుండి నర్సాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై నస్తీపూర్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. నస్తీపూర్ గ్రామ శివారులోని లోటస్ చాక్లెట్ పరిశ్రమ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు ఒక్కసారి విరిగి రోడ్డుపై పడడంతో ఆ సమయంలో ఎవరు వెళ్లకపోవడం వల్ల భారీ ప్రమాదం తప్పింది. రెండు గంటల తర్వాత స్థానికులు జేసీబీతో చెట్టును తొలగించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బొంతపల్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కాషాయ జెండాలతో జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు చేశారు. ర్యాలీకి పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిన్నారం సీఐ నయాముద్దీన్ , ఎస్ఐ భరత్‌భూషన్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్‌భాస్కర్ రెడ్డి, వినోద్‌గౌడ్, గణేష్, చంద్రశేఖర్, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జోగిపేటలో..

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను పబ్బతి, వీరహనుమాన్ దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పబ్బతి హనుమాన్ దేవాలయంలో ఆలయ పూజారి లక్ష్మణచారి భక్తులకు అర్చన, ప్రసాదాలను పంపిణీ చేశారు. వీరహనుమాన్ దేవాలయంలో ఆలయ పూజారి మాణిక్‌శర్మ పంతులు పూజలు చేశారు. సాయంత్రం దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణాన్ని పఠించారు.



వేడుకల్లో పాల్గొన్న డీఎస్పీ ప్రభాకర్, సీఐ నయాముద్దీన్

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



నారాయణఖేడ్: యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలోని జీవన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో నిర్మించిన ఆలయంలో గురువారం కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమయజ్ఞం, పూజ, విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చెర్మన్ దారంశంకర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ వ్యవస్థాపకులు నాగంజీవన్, బాల్‌రెడ్డి, లక్ష్మణ్ శాలువాలతో సన్మానించారు.

కడ్పల్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో కోచ్చేరు బంగారు కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం నిర్వహించారు. గ్రామస్తులు మందిరంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూంరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.